బచ్చన్నపేట : సీహెచ్‌సీలో బతుకమ్మ ఆడుతున్న వైద్య సిబ్బంది

జనగామ రూరల్ : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు

బచ్చన్నపేట, అక్టోబర్ 18 : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం వైద్య సిబ్బంది బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి కొబ్బరి కాయలు కొట్టి అగర్‌వత్తులు పెట్టి బతుకమ్మ ఆడారు. డీజేతో ఆడిపాడారు. కార్యక్రమంలో డాక్టర్ సిద్ధార్థరెడ్డి, ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది 108 ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీస్తుజ్యోతి కళాశాలలో..

జనగామ రూరల్ : దేశంలోనే వివిధ ప్రాంతాల నుంచి వచ్చి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు బతుకమ్మ వేడుకల్లో సంబురంగా పాల్గొన్నారని కళాశాల డైరెక్టర్ ఫాదర్ విజయ్‌పాల్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని యశ్వంతాపూర్ గ్రామంలోని క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌పాల్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ వేడుకలు నిర్వహిస్తామన్నారు. క్రీస్తు జ్యోతి అన్ని మతాల పండుగలకు వేదిక అని అన్నారు. విద్యార్థుల సంప్రదాయ వస్త్రధారణ ఆకట్టుకుంది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. చంద్రశేఖర్ రెడ్డి, అధ్యాపకులు సంతోష కుమారి, స్వర్ణ, సరిత, ఆమని, మాలతి, గీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కావ్య

బచ్చన్నపేట, అక్టోబర్ 18 : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని గొడుగు కావ్య రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కర్ల కృష్ణ వేణి తెలిపారు. అండర్ 17 విభాగంలో కావ్య ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. కావ్యను ప్రిన్సిపాల్, డీఈవో రాము, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నరేందర్, పీఈటీ అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి గ్రామం, పాఠశాలకు మంచి పేరు తేవాలని వారు ఆకాంక్షించారు. అలాగే కావ్యను సర్పంచ్ కోనేటి స్వామి, పంచాయతీ కార్యదర్శి రుబీనా సుల్తానా అభినందించారు.

అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఆస్పత్రిలో అన్నదానం

బచ్చన్నపేట, అక్టోబర్ 18 : చంపక్‌హిల్స్‌లోని మాతాశిశు సంరక్షణ దవాఖాన వద్ద బుధవారం అన్నదానం చేశారు. మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన ఆర్బీఎస్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు సిద్ధార్థ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రోగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అవతారంలో ఉమా మహేశ్వరీదేవి

జనగామ, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక గుండ్లగడ్డ ఉమామహేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. అష్టరూపాలతో అష్టసిద్ధులు ప్రసాదించే దేవతగా భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారికి ఘనంగా కుంకుమార్చన, ధూప, దీప నైవేద్యం సమర్పించారు. అమ్మవారి పారాయణం పట్టించి భక్తులకు ప్రసాదం అందించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పూజారులు రామశర్మ, మిర్యాల రాజేశ్, భార్గవ్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాంత్, పోకల విజయ్ కుమార్, విఘ్నేశ్, స్వాతి, పార్వతి, అరుణ్, బింగి రమేశ్, బండారి గంగాధర్, కేవీఎల్ఎన్ రెడ్డి, శివరాజ్ యాదవ్, గట్టు ఉపేందర్, కందుకూరి సంతోష్, భాస్కర్, కేశెట్టి భిక్షపతి, మచ్చ రాజు, ముత్తినేని శ్రీధర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బండా ప్రకాశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నిమ్మల స్వామి

బండా ప్రకాశ్‌కు పుష్పగుచ్ఛం అందజేత

జనగామ రూరల్, అక్టోబర్18: ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డా. బండా ప్రకాశ్ ముదిరాజ్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జనగామ జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం డైరెక్టర్ నిమ్మల స్వామి కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముదిరాజ్ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఆర్టీసీ దసరా ఆఫర్

జనగామ చౌరస్తా, అక్టోబర్ 18 : దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికులకు టీఎస్ ఆర్టీసీ నగదు బహుమతులు ప్రకటించినట్లు జనగామ డిపో మేనేజర్ వీ జ్యోత్స్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి 30 మధ్యలో బస్సులో ప్రయాణించే 110 మందిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి రూ.11 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. వరంగల్ రీజియన్ పరిధిలో ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.9, 900 చొప్పున నగదు బహుమతి అందజేస్తారని పేర్కొన్నారు. దీని కోసం పైన పేర్కొన్న తేదీల్లో ప్రయాణికులు బస్సు దిగిన తర్వాత టికెట్ వెనకాల ఆధార్ కార్డులో ఉన్నట్లు వారి పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ రాసి బస్టాండ్‌లో ఏర్పా టు చేసిన లక్కీ డ్రా బాక్సులో టికెట్‌ను వేయాలని డీఎం సూచించారు. జనగామ, రఘునాథపల్లి బస్టాండుల్లో బాక్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పాపన్న విగ్రహ నిర్మాణానికి విరాళం

జనగామ రూరల్, అక్టోబర్18: మండలంలోని వెంకిర్యాలలో సర్వాయి పాపన్న విగ్రహ నిర్మాణానికి బీఆర్ఎస్ మండల నాయకుడు కొండబోయిన రాజూయాదవ్ బుధవారం రూ. 5వేల విరాళం అందించారు. పాపన్న నేటి తరానికి ఆదర్శమని ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తాళ్లపల్లి ఆశోక్ గౌడ్, కృష్ణాగౌడ్, అంజయ్య గౌడ్, శివరాం గౌడ్, సిద్ధిరాములు గౌడ్, బుచ్చి రాములు గౌడ్, గొల్లురి నరేందర్, మల్లేశం, పర్శయ్య పాల్గొన్నారు.

విరాళం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు రాజూయాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

'పల్లా'పై కొమ్మూరి వ్యాఖ్యలు సరికాదు'

జనగామ రూరల్, అక్టోబర్18: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరి కాదని పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెంబర్తిలో బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో మాట్లాడారు. జనగామ అభివృద్ధికి పాటుపడే నాయకుడి ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఎంత అభివృద్ధి చేస్తాడనే చూడాలన్నారు. జనగామ అభివృద్ధికి పాలేరుగా పని చేస్తానని సీఎం కేసీఆర్ సభలో పల్లా ప్రకటించారన్నారు. పల్లాపై కొమ్మూరి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొలుసుల ఎల్లయ్య, ఇబ్రహీం, గోనెల సుధాకర్, సంకటి ఎల్లయ్య, రామ్మూర్తి, కంతిరి రాజు, రాపోలు సోమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డబ్ల్యూహెచ్‌వో బృందం

బచ్చన్నపేట సీహెచ్‌సీ తనిఖీ

బచ్చన్నపేట, అక్టోబర్ 18 : మండల కేంద్రంలోని సీహెచ్‌సీని బుధవారం డబ్ల్యూహెచ్‌వో రాష్ట్ర కోఆర్డినేటర్ రాజేంద్రకుమార్‌సింగ్ బృందం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మండల పరిధిలో బోదకాలు వ్యాధి నివారణ, ఇంకా ఎన్ని మందులు ఇవ్వాలో వివరాలను తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బోదకాలు వ్యాధి నివారణ కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి, వైద్యురాలు శిరీష, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

కారోబార్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

జనగామ రూరల్, అక్టోబర్18: మండలంలోని ఎర్రగొల్లపహాడ్ గ్రామ కారోబార్ మల్లేశ్‌పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వంగాల రేణుకా శంకర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కారోబార్ కొందరితో కలిసి తప్పుడు ఫిర్యాదులు చేయడం, తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. గ్రామ పరిశుభ్రత, పనులు చేయడం లేదని గతంలో మందలించడంతో కక్షతో తమపైనే తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. వెంటనే అతడిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

రైతులకు లేగదూడలను అందిస్తున్న మహేశ్ అగర్వాల్

లేగదూడల పంపిణీ

దేవరుప్పుల, అక్టోబర్ 18: రాష్ట్ర గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం సీతారాంపురంలో 10 మంది రైతులకు 20 లేగదూడలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోశాల ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ మాట్లాడుతూ ప్రతి రైతు ఇంట్లో గోమాత ఉండాలన్నారు. తమ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా గోవులను పంపిణీ చేస్తుందన్నారు. రైతులు రసాయన ఎరువులు మాని సేంద్రియ వ్యవసాయం చేయాలని సూచించారు. రాష్ట్ర గోశాల సభ్యులు రోజారాణి, స్థానిక భద్రకాళి గోశాల నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ బస్వ మల్లేశ్, ఉప సర్పంచ్ యాకూబ్ పాషా, వార్డు సభ్యులు బాషిపాక కొండయ్య, భద్రకాళి గోశాల గౌరవాధ్యక్షుడు అజీర్మా రవి, అధ్యక్షురాలు భారతి, రైతులు పాల్గొన్నారు.